
ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet
Edition

శనివారం 5 మార్చి 2025
www.prajaaswaramdaily.com
2 pm

# బోయిన్‌పల్లి అదృశ్యం కేసులో పురోగతి




హైదరాబాద్: బోయిన్‌పల్లిలో ఆరుగురు కుటుంబసభ్యులు అదృశ్యమైన ఘటనలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. వారంతా ఎంజీబీఎస్ నుంచి విజయవాడ వెళ్లినట్లు సీసీ ఫుటేజ్‌లో పోలీసులు గుర్తించారు. తమ మధ్య ఎలాంటి తగాదాలు లేవని.. అయితే, అందరి ఫోన్లు స్విచ్‌ఆఫ్ వస్తుండటంతో కుటుంబసభ్యుడు నరేశ్ ఆందోళన వ్యక్తంచేశాడు. వారంతా తీర్థయాత్రకు వెళ్లి ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపాడు.

న్యూ బోయిన్‌పల్లి ఏడుగుళ్ల సమీపంలో నివాసం ఉండే మహేశ్, ఉమా దంపతులు, వారి ముగ్గురు పిల్లలతోపాటు సంధ్య అనే మరో కుటుంబ సభ్యురాలు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. మహేశ్ స్థానిక నీటి సరఫరా కేంద్రంలో ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. వీరి ఇంటికి సంధ్య గురువారం ఉదయం వెళ్లింది. మహేశ్, ఉమా.. వారి పిల్లలు రిషి, చైతు, శివన్‌లతో పాటు సంధ్య ఒకేసారి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఉమా సోదరుడు భిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ ఆరుగురు ఆటో బుక్ చేసుకొని బోయిన్‌పల్లి నుంచి ఎంజీబీఎస్ స్టేషన్‌కు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడినుంచి విజయవాడ వెళ్లినట్లు గుర్తించి.. ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.

# వాయుసేన, పౌర విమానయాన సేవలకు పచ్చజెండా

ఢిల్లీ : ఆదిలాబాద్‌లోని రక్షణశాఖకు సంబంధించిన వైమానిక విమానాశ్రయంలో పౌరవిమానయాన సేవలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. కీలకమైన ఆదిలాబాద్ విమానాశ్రయంలో వాయుసేన శిక్షణ సంస్థను ఏర్పాటు చేయబోతున్నామని, దీంతోపాటు.. పౌర విమాన సేవల కోసం ఉమ్మడి కార్యాచరణ చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ఆ మేరకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖలో చేశారు. శుక్రవారం ఈ మేరకు రాజ్‌నాథ్ సింగ్ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. రాజ్‌నాథ్ సింగ్ సానుకూల స్పందనను కిషన్‌రెడ్డి హృదయపూర్వకంగా స్వాగతించారు. ఇందుకుగానూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు..

# మజ్లిస్.. ఏకగ్రీవానికి కుట్ర

**కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదు**

**ఈ రెండు పార్టీలు మజ్లిస్ కు బానిసలుగా మారాయి**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్ ను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని వెల్లడి**



హైదరాబాద్ : కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మజ్లిస్ పార్టీకి బానిసలుగా మారిపోయాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌ను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, ఈ నగరాన్ని మజ్లిస్ పార్టీకి అప్పగించారని ఆరోపించారు. పార్టీకి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. మజ్లిస్ మెప్పు కోసమే ఇతర పార్టీలు వారి అడుగులకు మడుగులు వత్తుతున్నాయని తెలిపారు. అన్ని పార్టీలు పోటీ చేస్తాయని భావించామని, కానీ రాహుల్ గాంధీ, కేసీఆర్‌లు పోటీ చేయకుండా మజ్లిస్‌కు ఏకగ్రీవం చేయాలని యత్నించారని కిషన్ రెడ్డి ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు మజ్లిస్‌కు అనుకూలంగా లేరని, అయితే మజ్లిస్ చేస్తున్న సంఘవిద్రోహ చర్యలను సమర్థించరని చెప్పారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఓటర్లు తమ ఓటును ఆత్మసాక్షిగా వినియోగించాలని కోరారు. మజ్లిస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలు క్షమించరనిదని హెచ్చరించారు. మజ్లిస్ మద్దతు కోసమే బీఆర్ఎస్ పోటీ చేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను వేర్వేరుగా చూడాల్సిన అవసరం లేదని, ఇవి రెండు కాదు ఒకటేనని స్పష్టం చేశారు. బీజేపీ నుంచి వెళ్లిపోయిన నేతలకు కూడా విజ్ఞప్తి చేస్తూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. అన్ని పార్టీలకు చెందిన కార్పొరేటర్లు బీజేపీకి మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనంతరం కేంద్ర మంత్రి కిషన్ కుమార్‌రెడ్డి జగ్జీవన్ రామ్ గురించి మాట్లాడారు. "మంచి విద్యావేత్త, మానవతా వాది జగ్జీవన్ రామ్. రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని ఉపప్రధాని మంత్రి వరకు ఎదిగారు. ఎమర్జెన్సీ లో ఇందిరాగాంధీ కి వ్యతిరేకంగా బయటకు వచ్చారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని స్ఫూర్తి గా తీసుకొని అందరికీ హక్కుల కోసం కృషి చేసిన వ్యక్తి. 1977 లో తన పార్టీ నీ జనతా పార్టీ లో విలీనం చేశారు. ఆయన ను ప్రధానిగా ప్రకటించి 1980 లో బీజేపీ ఎన్నికలకు వెళ్ళింది... కానీ దురదృష్టవశాత్తు కాంగ్రెస్ అడ్డుకుంటుంది. ఆయన్ను ప్రధాని కాకుండా అడ్డుకున్నది దుర్మార్గ పార్టీ. ఆయన ఆలోచన విధానం తో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే అంకిత భావం తో మోడీ ప్రభుత్వం పని చేస్తుంది. ఆయనతో పాటు కల్సి కూర్చునే అవకాశం ఒక విద్యార్థి నేతగా నాకు 1978 లో వచ్చింది.. నా రాజకీయ ప్రస్థానం అయన సభతోనే ప్రారంభం అయింది." అని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## భారీగా దళసభ్యుల లొంగుబాటు

**ఐజీపీ ఎదుట లొంగిపోయిన 86 మంది**

**అందులో బీజాపూర్ జిల్లా, సుఖ్మ జిల్లా సభ్యులు**

**ఒక్కొక్కరికీ రూ.25 చొప్పున చెక్కులు**

పోలీసులు చేపట్టిన స్పెషల్ ఆపరేషన్ సత్ఫలితాలను ఇస్తోంది. అందులో భాగంగా పోలీసుల ఎదుట 86 మంది మావోయిస్తులు లొంగిపోయారు. అందులో 20 మంది మహిళలు, 66 మంది పురుషులు ఉన్నారు. భద్రాద్రి కొత్తగూడెం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి ఎదుట 86 మంది మావోయిస్టు దళ సభ్యులు లొంగిపోయారు. ప్రతి మావోయిస్టుకు 25 వేల రూపాయల చెక్కును ఐజీ అందజేశారు. మావోయిస్టులు బీజాపూర్ జిల్లా, సుఖ్మ జిల్లా సభ్యులు లొంగిపోయారు. మావోయిస్టు పార్టీ పేరుతో బలవంతపు వసూళ్లు అపాలని పోలీసులు నిర్ణయించారు.. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి అడ్డంకిగా మారారు. దీంతో పోలీసులు స్పెషల్ ఆపరేషన్ తలపెట్టారు. ఈ నేపథ్యంలో గత నాలుగు నెలల్లో భారీ ఎత్తున మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. గత నాలుగు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 66 మంది మావోయిస్టులు అరెస్ట్ అయ్యారు. 203 మంది లొంగిపోయారు. కార్యక్రమంలో భద్రాద్రికొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజ్, ములుగు ఎస్పీ శబరీష్, పలువురు పోలీస్ అధికారులు ఉన్నారు

## మోదీకి 'శ్రీలంక మిత్ర విభూషణ' పురస్కారం



కొలంబో : ప్రధాని నరేంద్ర మోదీకి శ్రీలంక ప్రభుత్వం అత్యున్నత పురస్కారాన్ని అందజేసింది. ఆ దేశ అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే తమ దేశం మిత్ర దేశాధినేతలకు ఇచ్చే అత్యున్నత పురస్కారం 'శ్రీలంక మిత్ర విభూషణ'ను అందజేశారు. దీనిలోని ధర్మ చక్రం ఇరు దేశాల సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. మధ్యలో ఉండే కలశం శ్రేయస్సును, తొమ్మిది విలువైన రత్నాలు ఇరు దేశాల మధ్య శాశ్వతమైన స్నేహాన్ని సూచిస్తే... సూర్యుడు, చంద్రుడు కాలాతీత బంధానికి సూచిక. ఇలా ఇవన్నీ ఇరు దేశాల మధ్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక బంధాన్ని సూచిస్తాయి. కాగా, ప్రధాని మోదీ మూడు రోజుల పర్యటన కోసం శ్రీలంక వెళ్లిన విషయం విదితమే.

# రష్యా దాడి.. 18 మంది మృతి

**జెలెన్‌స్కీ సొంత నగరం పై ... ఘాతుకం**



ఉక్రెయిన్ : కీవ్‌పై రష్యా మరోసారి దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత నగరం క్రైవీ రిపై శుక్రవారం మాస్కో క్షిపణి ప్రయోగించిందని కీవ్ అధికారులు పేర్కొన్నారు. పిల్లల ఆటస్థలం సమీపంలో ఈ దాడులు జరిగాయి. తొమ్మిది మంది చిన్నారులు సహా మొత్తం 18మంది మరణించారు. 60 మందికి పైగా గాయపడ్డారు. ఐదు అపార్ట్‌మెంట్ భవనాలు దెబ్బతిన్నాయి. ఎక్కడ దాడి చేస్తున్నామనే విషయం తెలిసే రష్యా ఈ దురాగతానికి పాల్పడిందని జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

"ఇవి ప్రమాదవశాత్తూ జరిగిన దాడులు కావు. ఎక్కడ దాడులు చేస్తున్నారనే విషయం వారికి కచ్చితంగా తెలుసు. రష్యా ఉద్దేశపూర్వకంగానే క్రైవీ రిలోని ఇంధన సౌకర్యాలు ఉన్న ప్రాంతంపై క్షిపణిని ప్రయోగించింది. ఈ చర్యలతో మాస్కో అమెరికాతో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని విస్మరించింది. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు కృషి చేస్తామని రష్యన్లు చేసిన వాగ్దానాలు ఈ దాడులతో ముగిశాయి. దౌత్యం అంటే ఏమిటో వారికి ఎప్పటికీ అర్థం కాదు" అని జెలెన్‌స్కీ మాస్కోపై మండిపడ్డారు. తమతో జరుగుతున్న యుద్ధాన్ని ముగించే ఉద్దేశం రష్యాకు లేదనే విషయం ప్రపంచం మొత్తానికి అర్థమవుతోందన్నారు.

# టీటీడీకి సహకరించండి

**2023లోనే కరీంనగర్ లో నిర్మాణానికి అనుమతి**

**అదే ఏడాది 10 ఎకరాల స్థలంలో భూమి పూజ**

**నాటి నుంచి నేటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు**

**టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు కేంద్రమంత్రి బండి సంజయ్ లేఖ**



కరీంనగర్ : కరీంనగర్‌లో చేపట్టిన టీటీడీ ఆలయ నిర్మాణానికి తగిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 2023లో కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అనుమతి లభించిందని, అదే ఏడాది మే 31న కరీంనగర్‌లోని 10 ఎకరాల భూమిలో భూమి పూజ కూడా జరిగిందని గుర్తు చేశారు. అయితే ఆ రోజు నుంచి నేటివరకు నిర్మాణం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ లేఖ రాశారు. దేశవ్యాప్తంగా ధర్మ ప్రచారంతో పాటు హిందూ దేవాలయాల నిర్మాణ అభివృద్ధికి టీటీడీ చేస్తున్న కృషిని అభినందిస్తూ ఈ లేఖ రాశారు. ధూప-దీప-నైవేద్యాలకు నోచుకోని అనేక దేవాలయాలను టీటీడీ ఆదుకోవడం గొప్ప విషయమని ప్రశంసించారు. టీటీడీ ఆలయ నిర్మాణాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న కరీంనగర్ సహా పొరుగు జిల్లాల హిందూ భక్తుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని, ఆలయ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ కోరారు.